ప్రజాశక్తి
సోమవారం 25 ఆగస్టు 2025



డిఎస్‌సిలో సత్తాచాటిన డేవిడ్

-మూడు విభాగాల్లో ర్యాంకులు



ప్రజాశక్తి-అనంతగిరి: డీఎస్సీలో గిరిజన అభ్యర్థి డేవిడ్ మూడు విభాగాల్లో సత్తా చాటారు. మండలంలోని టోకూరు పంచాయతీ పరిధి జాకరవస గ్రామానికి చెందిన నరాజీ. డేవిడ్ డీఎస్సీ ఫలితాలలో మూడు కేటగిరీలలోని సత్తా చాటారు. స్కూల్ అసిస్టెంట్, టిజిటి ఇంగ్లీష్, టిజిటి సోషల్ సబ్జెక్ట్‌ల కేటగిరీలలో సత్తా చాటాడు.

కార్మికుల సమస్యలపై ఉధృత పోరాటాలు

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-డంబ్రిగుడ: రానున్న రోజుల్లో కార్మిక సమస్యలపై ఉధృతమైన పోరాటాలు నిర్వహించాలని, అందుకు కార్మికులు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు సిఐటియు నేతల సమావేశం తాంగుల బాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, గత కొంతకాలంగా కార్మిక సమస్యలు పరిష్కారంకై అల్లూరు జిల్లాలో కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి అనేక సమస్యలుపై సిఐటియు రాజీలేని పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. కార్మికులకు అండగా సిఐటియు ఎర్రజెండా మాత్రమేనన్నారు. అంగన్వాడి, ఆశ, ఐకెపి వివోఏ వంటి పోరాటాలు నిర్వహించామని తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు పథకం ఉద్దేశం మంచిదైనా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లు పరిస్థితులు అగమ్యగోచరంగా మారాయని తెలిపారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దు చేసి కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని, ఈ చట్టాలు అమలు జరిగితే బానిసలుగా బతకాల్సి వస్తుందని తెలిపారు. కార్మికులు శ్రమను దోచుకునేందుకే ప్రవేట్ సంస్థలు బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలు చేకూరే విధంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చట్టాల్లో మార్పులు తీసుకొస్తుందని అందుకు కేంద్రంపై పెద్ద ఎత్తున ప్రతిఘటన ఉద్యమం చేయాలని తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ చేస్తున్నారని దీంతో ఎస్సీ ఎస్టీ లకు రిజర్వేషన్లు ఉండవని నిరుద్యోగ సమస్య మరింతగా పెరిగే అవకాశం ఉందన్నారు.

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి యస్ బి పోతురాజు, జిల్లా ఉపాధ్యక్షులు జె.భగత్‌రాం మాట్లాడుతూ, కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టాలు రాష్ట్ర ప్రభుత్వం సమర్ధించడం దుర్మార్గమని తెలిపారు కూటమి ప్రభుత్వం కార్మిక ద్రోహులుగా మిగిలిపోతారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని తెలిపారు వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న డైలీ వేస్ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భాస్కర్, సత్యవతి, పవిత్ర, కన్నమ్మ, లక్ష్మి, అంగన్వాడి, ఆశ, ఐకెపి, మిడ్డి మిల్, ఆటో, బిల్డింగ్ కార్మికులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా రైతు భరోసా కేంద్రం

అవస్థలు పడుతున్న రైతులు



నిరుపయెగంగా ఉన్న రైతు భరోసా కేంద్రం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని అడ్డుమండ పంచాయతీ సన్యాసమ్మపాలెంలో 2019 సంవత్సరంలో వైసిపి ప్రభుత్వం హాయంలో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేశారు. గత రెండు సంవత్సరాలుగా ఈ రైతు భరోసా కేంద్రంలో కార్యకలాపాలు నిలిచి పోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తుంది. చుట్టుపక్కల పిచ్చి మొక్కలతో నిరుపయోగంగా రైతు భరోసా కేంద్రం ఉంది. గతంలో కమ్యూనిటీ హాల్ గా ఏర్పాటు చేసి గ్రామస్తులు ఎన్నో కార్యక్రమాలు సమావేశాలు పలు రకాల సేవ కార్యక్రమాలకి ఉపయోగించేవారు. రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసినప్పటి నుంచి రైతులకు ఎటువంటి ఉపయోగం లేకుండా ఉండిపోయింది.

సీపీఎం మండల నాయకులు కే.అప్పారావు, టి అప్పలకొండ పడల్ మాట్లాడుతూ, రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు సేవలు అందించాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంచడం సరికాదన్నారు. బిల్డింగ్ ఉన్నప్పుడు సేవలు అందించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఉపయోగంలోకి తీసుకురావాలని గిరిజన రైతులు , నాయకులు కోరారు.

ఆదివాసీ ఉద్యమ నేత ఏలియా మృతి

-పలువురు ఘన నివాళి

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని తాడిగిరి గ్రామ పంచాయతీ చెందిన ఓపిజిఆర్, డిఎల్ఓ వ్యవస్థాపకులు చెండా ఏలీయా(67)అనారోగ్యంతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం ఉదయం నుంచి చెండా ఏలీయా మృత దేహానికి సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, అనంతగిరి మండలం జడ్పీటీసీ గంగరాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బలదేవ్, పార్టీ జిల్లా నాయకులు కిండంగి రామారావు, ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, ఏపీ ఆర్టీసీ రీజినల్ చైర్మన్ అరకు ఇంచార్జి సివెరి దోన్ను దొర, ఉపాధ్యాయ సంఘ, పాస్టర్ అసోసియేషన్ దైవ సేవకులు పలు ప్రజా సంఘ నాయకులు పూలమాల వేసి ఘన నివాలి అర్పించారు. తడిగిరి గ్రామం నుండి హుకుంపేట మండల కేంద్రం వరకు అంతిమయాత్ర వందలాది మంది సంఖ్యతో ఘనంగా జరిగింది.

అనంతరం జరిగిన సంతాప సభలో సి.పి.ఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ, ఆదివాసీ సమాజ హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడిన ప్రముఖ నాయకుడు ఏలియా మరణం ఆదివాసీ ఉద్యమానికి తీరని లోటు అన్నారు.ఆదివాసుల స్వయం ప్రతిపత్తి, భూమి హక్కులు, సామాజిక న్యాయం గుర్తింపు కోసం ఆయన చేసిన కృషి ఆదివాసీ సమాజంలో చెరగని ముద్ర వేసిందన్నారు. ఏలియా జీవితం ఆదివాసీ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచి, సామాజిక అసమానతలపై పోరాటం స్ఫూర్తిని రగిల్చిందిని తెలిపారు.ఏజెన్సీ ప్రాంతంలో అటవీ హక్కుల చట్టం అమలు, ఆదివాసీ సంస్కృతి సంరక్షణ, స్వయం నిర్ణయాధికారం కోసం ఆయన చేసిన పోరాటాలు ఎన్నో ఆదివాసీ సముదాయాలకు బలాన్ని, గౌరవాన్ని తెచ్చిపెట్టాయని ఆయన గుర్తు చేశారు. ఏలియా సిద్ధాంతాలు, ఆశయాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు.ఆయన స్ఫూర్తితో ఆదివాసీ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తూ, సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు టి.కృష్ణారావు, కిల్లో రామారావు, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


అంతిమ యాత్రలో పాల్గొన్న నాయకులు (ఇన్‌సెట్‌లో ఏలియా ఫైల్ ఫొటో)


రోడ్డుపై కారును చుట్టిముట్టిన పశువులు

ఘాట్ రోడ్డుపై పశువుల సంచారం

వాహనదారులకు తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అనంతగిరి ఘాట్ రోడ్డు శివలింగపురం ప్రధాన రహదారి వద్ద నిత్యం పశువుల బెడద అధికైంది. దీంతో అనంతగిరి, అరకు, డుంబ్రిగుడ. వంటి ప్రముఖ పర్యాటక కేంద్రాలను తిలకించేందుకు వస్తున్న పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు పొడవునా పశువులు గుంపు గుంపులుగా చేరి ఉంటాయి. దీంతో వాహన చోధకులు పశువుల గుంపులను తప్పించుకొని ముందుకు వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. తప్పించుకున్న క్రమంలో పశువులను వాహనాలు చిన్న పాటి ఢీకొంటే అందుకు పరిహారం చెల్లించాలని స్థానికులు వారిపై ఘర్షణలు పడుతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా స్థానిక పంచాయతీ, సచివాలయం సిబ్బంది సమస్యను పరిష్కరించాలని కోరారు.

ధారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలి



దారకొండలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న సాధన కమిటి నాయకులు

ప్రజాశక్తి -సీలేరు: ధారకొండను మండల కేంద్రంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని సాధన కమిటీ విజ్ఞప్తి చేశారు. జికె వీధి మండలం దారకొండలో ఆదివారం హనుమాన్ జంక్షన్ నుంచి వినాయక గుడి వరకూ శాంతి ర్యాలీ నిర్వహిస్తూ దారకొండ మండల కేంద్రం ఏర్పాటు చేయాలంటూ సాధన కమిటీ నాయకులు, ప్రజలు నినాదాలు చేశారు. అనంతరం సాధన కమిటీ నాయకులు సుంకర విష్ణుమూర్తి, మార్కు రాజు, కారే శ్రీనివాస్ తదితర నాయకులు మాట్లాడుతూ దారకొండ మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే ఆరు పంచాయతీల పరిధి గిరిజన గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. జికెవిధి మండల కేంద్రం 50 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో దారకొండ పరిసర ప్రాంతాల్లో ఉన్న పంచాయతీలు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లా అధికారులకు, ఇన్చార్జిలకు వినతిపత్రాలు అందజేసా మన్నారు. కార్యక్రమంలో సాధనకమిటీ నాయకులు మాజీ ఎంపిటిసి పోతురాజు గోవిందు, చిటికెల రాము, నడిగట్లరాజు, బాలు మల్లుదొర అల్లంకిరాజు, బత్తుల మాణిక్యం వరప్రసాద్ వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


పనులు నిలిపేసిన అక్విడెక్టు

అక్విడెక్టు నిర్మాణం పూర్తయ్యేనా?

ప్రజాశక్తి - కొయ్యూరు: మండలంలోని దొడ్డవరం, తాళ్ళపాలెం గ్రామాలకు సంబంధించి సుమారు 500 ఎకరాల మేర వ్యవసాయ సాగుభూమి ఉంది. దీనికి సాగునీరు అందించేందుకు గైరమ్మ ఆయకట్టు అక్విడెక్టు, కెనాల్ రెండు సంవత్సరాల కిందట పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. గత సంవత్సరం రెండు గ్రామాల ప్రజలు చందాలు వేసుకుని డ్రమ్ములతో కూడిన తాత్కాలిక వంతెన నిర్మించుకున్నారు. అయినా పూర్తిగా సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళడం వల్ల నూతన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ పనిని కాంట్రాక్ట్ తీసుకుని పని మొదలుపెట్టి ఇప్పటికి 4 నెలలు గడుస్తున్నా ఇంకా పూర్తి కాలేదని ఈ విషయమై రైతులు ప్రశ్నిస్తుంటే పొంతనలేని సమాధానాలు చెప్తున్నారని వ్యవసాయం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న దొడ్డవరం, తాళ్ళపాలెం గ్రామస్తులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరగా అక్విడెక్టు పనులు పూర్తి చేసి అందుబాటు లోకి తీసుకురావాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.


ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

నిర్వాసితుల ధ్రువీకరణ పత్రాలపై సమీక్ష

ప్రజాశక్తి -చింతూరు: పోలవరం నిర్వాసితుల ఆర్అండ్ఆర్ గ్రామసభ ఆదివారం పాతప్రభుత్వఆసుపత్రి ఆవరణలో నిర్వహించారు. సుమారు 800 కుటుంబాలకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలు లేనందున పెండింగ్ జాబితాను అధికారులు నిర్వాసితులకు చదివి వినిపించారు. కొందరివి పాతరేషన్‌కార్డులు, ఓటర్ ఐడికార్డులు, మ్యారేజ్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులు, ఇంటిపన్నులు వగైరా నిర్వాసితులు నుండి అధికారులు కోరారు. సభకు ముందుగా రంపచోడవరం ఇంచార్జ్ సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్ హాజరయ్యారు. ప్రజల పలు సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. టీమ్‌లవైజ్‌గా అధికారులను ఆయా పోలవరం నిర్వాసిత కుటుంబాలకు సంబంధించిన ధ్రువపత్రాల సేకరణకు నియమించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సుండం శ్రీనివాస్ దొర, విఆర్ఓ రామచంద్రరావు, ఆర్అండ్ ఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి

ప్రజాశక్తి-విఆర్‌పురం: నిర్వాసిత ప్రజలను ఆదుకునే విషయంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, నిర్వాసితులంటే ఈ కూటమి ప్రభుత్వానికి ఎందుకంత చిన్నచూపు అని మాజీ ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి విమర్శించారు. శబరి,గోదావరి ముంపు బాధితులను ఆదివారం ఆమె పరామర్శించారు. విఆర్‌పురంలో వార్డు సభ్యులు పరంకుశం శ్రీనుదేవి కుమారుడు వంశీకృష్ణ అకాల మృతి చెందాడు. వారిని ఓదార్చి అనంతరం వడ్డుగూడెం పంచాయతీలోని వీడియో కాలనీలో వైసిపి కార్యకర్త ముత్యాల యశ్వంత్ రోడ్డు ప్రమాదంలో రెండు చేతులూ విరిగిపోవడంతో అతనిని పరామర్శించారు. వడ్డుగూడెం కాలనీ శ్రీరామగిరిరాజుపేట, చింతరేవుపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీరామగిరి, వడ్డుగూడెం కాలనీ, చింతరేవుపల్లి, రామవరం తదితర గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయని వీరిని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటివరకూ ఎమ్మెల్యే శిరీష ముంపు గ్రామాల్లో ఎందుకు పర్యటించలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు మాచర్ల గంగయ్య, మాజీ మండల అధ్యక్షులు వైసిపి సీనియర్ నాయకులు పోడియం గోపాలరావు, పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న నాగులాపల్లి ధనలక్ష్మి

పాత స్నేహం..కొత్త జ్ఞాపకాలు..

అడ్డతీగల - ప్రజాశక్తి: స్థానిక మండల కేంద్రం ఆదివాసీ భవన్‌లో గురుకుల విద్యాలయం 1984-1990వ సంవత్సరం వరకు విద్యభ్యసించిన మొదటి బ్యాచ్ విద్యార్థులు మొత్తం మూడు సెక్షన్లు ఎ,బి,సిలో చదువుకున్న విద్యార్థులు 92 మంది కలవాలనుకున్నారు. దీనిలో భాగంగా ఆదివారం 60 మంది మిత్రులు కలిసారు. ప్రతి ఒక్కరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను, గుర్తు చేసుకొంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా ఒక నిర్ణయం తీసుకున్నారు. ప్రతీ ఒక్కరూ ప్రతి నెలా రూ.100లు స్నేహితుల సంక్షేమనిధిలో జమ చేస్తారు. ఈ దసరా సెలవులకు గానీ, వచ్చే వేసవిసెలవులకు గానీ గురువులు, స్నేహితులు కుటుంబ సమేతంగా తాము చదువుకున్న పాఠశాల ఎపిఆర్ఎస్‌లో కలవడానికి తీర్మానించారు. దీనికి సంబంధించి వివిధ కమిటీలు కూడా ఏర్పాటు చేశారు. ఫస్ట్‌బ్యాచ్‌లో హయ్యర్ క్యాడర్‌లో ఉన్న ఎన్టిఆర్ జిల్లా, మచిలీపట్నంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న శిరసం పోతురాజుదొర ఎన్నో ముఖ్య కార్యక్రమాలు ఉన్నప్పటికీ కార్యక్రమానికి వచ్చి స్నేహితులను చూసి ఉద్వేగానికి లోనయ్యారు.


కలుసుకున్న పాతమిత్రులు


ప్రమాదకరంగా డి.అగ్రహారం వంతెన

తక్షణమే వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం దారకొండ పంచాయతీ డి.అగ్రహారం వంతెన తక్షణమే నిర్మించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు వరదలకు వంతెన సగభాగం కోతకు గురైంది. అగ్రహారం, కోరాపల్లి, కుమ్మరపల్లి, పెద్దగొంది, జి.నేరేడుపల్లి, ఎస్ నేరేడుపల్లి, కాట్రగెడ్డ గ్రామాల ప్రజలు ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తుంటారు. ఆంధ్రా- ఒడిశా వెళ్లేందుకు కూడా ఇదే మార్గం కావడంతో మరింత రద్దీగా ఉంటోంది. వంతెన కోతకు గురవడంతో ఎవరైనా వాహనచోదకులు ఏమరుపాటుగా వచ్చినా, రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రధాన రహదారి కాబట్టి రాకపోకలు సాగించడానికి ఇబ్బందిగా ఉందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి సత్వర చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత సునీల్ కుమార్

అర్హులైన వికలాంగ పింఛన్లు తొలగించొద్దు

ప్రజాశక్తి- పెదబయలు : అర్హులైన వికలాంగ పింఛన్లు తొలగించొద్దని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జె.సునీల్ కుమార్ మండల అధ్యక్షుడు బి.గంగాధర్ డిమాండ్ చేశారు. ఆవారం ఆదివాసీ గిరిజన సంఘం పెదబయలు మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్లు తొలగించి అర్హులకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. సదరం సర్టిఫికెట్లలో వైకల్యశాతాన్ని సవరించి, అనేకమంది అర్హులను పింఛన్లకు దూరం చేయడం దుర్మార్గమన్నారు. ఒకే రేషన్ కార్డులో ఒక్కరికే మాత్రమే పింఛను నిబంధనతో అనేకమందికి అన్యాయం జరుగుతోందని, ఈ నిబంధనను సడలించి, అర్హులైనంతమంది ఉన్నా అందరికీ పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల భారీ వర్షాలకు పంటలను నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. భారీ వర్షాలతో కొట్టుకుపోయిన రోడ్లు, కల్వర్టులకు మరమ్మతులు చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు పిఎం జన్‌మన్ కింద గృహనిర్మాణ లబ్ధిదారులకు రూ.పది లక్షల నిర్మాణసాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిహెచ్ రామారావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కె.రాజు, కె.నరసయ్య పాల్గొన్నారు.

26న ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో జూలై 10వ తేదీన విడుదల చేసిన ఆశా వర్కర్ పోస్టుల నోటిఫికేషన్‌కు సంబంధించి ప్రొవిజనల్గా సెలెక్ట్ అయిన పాడేరు డివిజన్ 11 మండలాలకు సంబంధించిన అభ్యర్థులకు వైద్య సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 26న ఉదయం 10 గంటల నుండి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తమర్బ విశ్వేశ్వర నాయుడు తెలిపారు. ప్రొవిజనల్గా సెలెక్ట్ కాబడిన అభ్యర్థులు మాత్రమే ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావలసినదిగా ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి పేర్కొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి- ఆనందపురం: ఆనందపురం మండలం గిడిజాలలోని సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజులపాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సుధీర్ సంధ్ర ప్రసంగించారు. విద్యార్థులు చదువులో, ప్రవర్తనలో ఉన్న భయాలను అధిగమించి వ్యక్తిత్వ వికాసం సాధించాలని సూచించారు. విద్యార్థి దశలో సృజనాత్మకతను వెలికితీయగలిగితే అద్భుతాలు సాధ్యమవుతాయని చెప్పారు. నేటి విద్యార్థులు రేపటి భారతదేశానికి దిశానిర్దేశం చేసే వారని గుర్తుచేస్తూ, తప్పటడుగులు వేయరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్.వేణుగోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మహేశ్వరరావు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గణితంలో మెళకువలు

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జెడ్పీ హైస్కూల్లో ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతులు ఆదివారం నిర్వహించారు. గణితంలో మెళకువలను గణిత ఉపాధ్యాయులు సిహెచ్.దయాసాగర్ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్న ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమం లో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేజ అప్పారావు, ఉపాధ్యాయులు ఎల్.శ్రీనివాస్, వంగపండు దుష్యంత్, వై.రమణ, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్త రహదారులతో అవస్థలు

ప్రజాశక్తి-అరకులోయ: దేశ విదేశాల్లో ప్రముఖ పర్యాటక కేంద్రంగా గాంచిన అరకులోయలో గుంతల రహదా రులు దర్శనమిస్తుండడంతో ఇటు స్థానికులు, అటు పర్యాటకుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుంతలు లేని రోడ్లు లక్ష్యమని ప్రభుత్వం ఒకపక్క ప్రకటనలు ఇస్తున్నప్పటికీ మరోపక్క మన్య ప్రాంతంలోని ప్రధాన రహదారుల పరిస్థితి ఆచరణ రూపం దాల్చడం లేదు. దీంతో నిత్యం పర్యాటకులు పలు ప్రమాదాలకు గురవడం పరిపాటిక మారిపోయింది. ఈ ప్రాంతంలోని ప్రమాదకరంగా మారిన రోడ్లన్నీ మరమ్మత్తులు చేసి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చి ప్రమాదాల బారి నుంచి తప్పించాలని పలుమార్లు అధికారులకు ఈ ప్రాంతం వాసులు విన్నవిస్తున్నప్పటికీ ఏ మాత్రం కూడా స్పందించకపోవడం గమనార్హం.అనేకచోట్ల రోడ్లు గోతులమయమై ప్రమాదకరంగా మారినప్పటికీ స్పందించే నాథుడు కరువయ్యారు. దీంతో ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఆ గోతుల్లో వర్షపు నీరు నుండి ప్రమాదాలకు దారి తీస్తుంది. చిన్నపాటి వర్షం వచ్చినా అరకు-విశాఖ ఘాట్ రోడ్డులో ప్రయాణం చేయాలంటేనే అరచేతిలో ప్రాణం పెట్టుకుని ప్రయాణిం చవలసిన దుస్థితి నెలకొందని స్థానికులు, పర్యాటకులు, ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళలో ప్రయాణం చేయాలంటే తీవ్ర భయాందోళనకు గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పర్యాటకులతో, ఉద్యోగులతో, ప్రయాణికులతో రద్దీగా



అస్తవ్యస్త రహదారిపై వెళుతున్న వాహనదారులు

ఉండే అరకులోయ ప్రాంతంలోని మరమ్మతుకు గురైన రోడ్ల గోతులు పూడ్చి బాగు చేయాలని కోరుతున్నారు. రోడ్డు పనులు చేసిన కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలకు దిలోదాకలిచ్చి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం వల్లే రోడ్లు వేసిన కొద్ది కాలానికి మళ్లీ పూర్వస్థితికి చేరుకుంటుందని ఈ ప్రాంత ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అరకు విశాఖ ప్రధాన రహదారిలోని మరమ్మతుకు గురైన రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..

చౌడుపల్లి శ్మశానవాటిక వంతెన వద్ద రోడ్డు అంచున గుంత



వంతెన సమీపంలో రోడ్డు పక్కన క్రుంగి గుంత ఏర్పడిన దృశ్యం

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి-పాడేరు ప్రధాన రహదారిలో వాహనదారులకు తీవ్ర ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలోని చౌడుపల్లి సమీపంలోని శ్మశానవాటిక వంతెన వద్ద రోడ్డు అంచు క్రుంగిపోయి పెద్ద గుంత ఏర్పడింది. అది రోజురోజుకూ విస్తరిస్తుండడంతో వాహనదారుల ప్రాణాలకు ముప్పుగా మారింది. ఈ రహదారిపై నిరంతరం వాహనాల రాకపోకలు సాగుతుండటంతో ఎప్పుడైనా పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు వెళుతూ ఉండగానే రోడ్డు కూలిపోయే ప్రమాదం కూడా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదమరిస్తే వాహనం గుంతలో పడిపోవడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే రహదారి అంచున ఉన్న గుంత క్రమక్రమంగా లోతు పెరగడంతో మోటార్ సైకిళ్లు, ఆటోలు, కార్లు పెద్ద ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఏర్పడిందని వారు చెబుతున్నారు. ప్రాణాలు ఫణంగా పెట్టుకుని ఈ మార్గంలో ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు వాపోయారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలిస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి-మధురవాడ : శిల్పారామం జాతరలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలో భాగంగా కళారాధనా మ్యూజిక్ అండ్ అకాడమీ చిన్నారులచే ఆదివారం నిర్వహించిన నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ముందుగా మూషికవాహన, కాలింగినర్ధన, నాగస్తుతి, నారసింహ కౌతం, భారతవేదమున, మహాగణాపతిం, ఐగిరినందిని, నారాయణాతే నమోనమో, రాజాం కొండా, కస్తూరి తిలకం వంటి గేయాలకు షణ్ముఖ ప్రియ, నక్షత్ర, రోషిత, జ్యోతికశ్రీ, వేదశ్రీ, సంహిత, సాయి ప్రణవి చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని శిల్పరామం అధికారి రమేష్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఉక్కులో ఇఒఐలు రద్దు చేయాలి

ప్రజాశక్తి-యంత్రాంగం

ఇఒఐ రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31వ తేదీన చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిర్వాసిత కాలనీల్లో ఆదివారం బైక్ ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహించారు.

ఉక్కునగరం : అగనంపూడి కాలనీ, కొండయ్యవలస కో-ఆపరేటివ్ స్టోర్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. వడ్లపూడి, కూర్మన్నపాలెం ముస్తాఫా జంక్షన్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉక్కునగరంలో రైతు బజార్ వద్ద ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సెక్టార్-3 వరకు బైక్ ర్యాలీ చేశారు. కూర్మన్నపాలెం వడ్లపూడి తదితర ప్రాంతాలలో ర్యాలీలు అనంతరం సమావేశం నిర్వహించారు. కూర్మన్నపాలెంలో జరిగిన సమావేశంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అయోధ్యరామ్ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణలో భాగంగానే అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించడం, 44 విభాగాలను ప్రైవేటు వారికి అప్పగించేందుకు ఐఒఐలను విడుదల చేశారని తెలిపారు. ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తూ ఉన్నతంగా నడపడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కూటమి నాయకులు మాయమాటలు చెప్పడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కూటమి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి సహకరిస్తుందన్నారు. కార్మికుల ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు శ్రీనివాసరాజు, కన్నంరెడ్డి జగ్గారావు, వీరాస్వామి, భాస్కరరావు, సన్యాసిరావు, వేణుబాబు, విశ్వనాధం, దత్తాత్రేయరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడలో పాదయాత్ర

గాజువాక : అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన పెదగంట్యాడ జంక్షన్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్ర పెదగంట్యాడ నిర్వాసితులు కాలనీ నుంచి నెల్లిముక్కు, సిద్దేశ్వరం, సీతానగరం, చినకోరాడ, దుర్గవానిపాలెం మీదుగా నడుపూరు గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మంత్రి రాజశేఖర్, యు.రామస్వామి, ఎన్.రామారావు, జె.రామకృష్ణ, పిట్టా రెడ్డి, గుజ్జి గణపతి మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకోవాలని, 44 విభాగాలకు సంబందించిన ఇఒఐ టెండర్లు రద్దు చేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయల్‌లో విలీనం చేయాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవలని, మిగిలి ఉన్న నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, ఉద్యోగులకు హెచ్ఆర్ఎతో కూడుకున్న పెండింగ్ పూర్తి జీతాలు ఇవ్వాలని, టౌన్ షిప్‌లో కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకొని ప్రైవేటీకరణ చెయ్యకుండా ఆపాలని, రాష్ట్రంలో అన్ని పార్టీలను కలుపుకొని ప్రధాన మంత్రితో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ పాదయాత్రలో పివి.రమణమూర్తి, మసేన్‌రావు, నందికి తాతారావు, ముసిరి శ్రీనివాసరావు, నమ్మి రమణ, తిప్పల గురునాథ్‌రెడ్డి, కొవిరి అవతారం, కొండా శ్రీనివాస్ రెడ్డి, గేదల మధుసూదన్‌రెడ్డి, పూతి పోతయ్యరెడ్డి, వంశీ, నాగిరెడ్డి, ఊరుకుటి అప్పారావు, గొందేశీ రాము, నమ్మి అప్పారావు పాల్గొన్నారు.

గంగవరంలో...

అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన గంగవరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. గంగవరంలో ప్రారంభమైన ర్యాలీ జాలారిపల్లిపాలెం, పల్లిపాలెం, చిన్న పల్లిపాలెం మీదుగా కొనసాగింది. పెద్ద ఎత్తున నిర్వాసితులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కారి నూకరాజు, వై.సోమేశ్వరరావు, పైడిరాజు, డివి.రెడ్డి, పేర్ల నూకరాజు, పేర్ల మస్తాన్ పాల్గొన్నారు.



కూర్మన్నపాలెంలో ర్యాలీ ప్రారంభంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు



బోల్తా పడిన ట్యాంకర్

ఆయిల్ ట్యాంకర్ బోల్తా

ప్రజాశక్తి- కొయ్యూరు: మండలంలోని కాట్రగడ్డ సమీపంలో ఉన్న రొంపుల ఘాట్‌రోడ్డులో శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఘాట్ రోడ్డులో 516-ఇ జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. హైవేకు చెందిన ఆయిల్ ట్యాంకర్ రొంపుల నుంచి కృష్ణదేవిపేట వైపు వస్తుండగా కాట్రగడ్డ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ అప్రమత్తం కావడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. గత పది రోజుల్లో అక్కడ ఇది మూడో ప్రమాదం కావడం గమనార్హం.



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు

మెడికవర్‌లో ఎండోస్కోపిక్ వర్క్‌షాప్

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ : విశాఖపట్నంలోని మెడికవర్ హాస్పిటల్స్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం, విశాఖపట్నం ఘాట్‌క్లబ్ , ఐఎంఎ విశాఖపట్నం బ్రాంచ్ సంయుక్తంగా ఆదివారం డాక్టర్ నిష్ఠల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రిలో అధునాతన ఎండోస్కోపిక్ వర్క్‌షాప్ నిర్వహించారు. దీని ఉద్దేశం వివిధ థెరప్యూటిక్ విధానాలను ప్రదర్శించడం, ఇందులో విస్తృతశ్రేణి ఎండోస్కోపీ, అల్ట్రాసౌండ్ కేసులు, థెరప్యూటిక్ ఈఆర్సీపి కేసులు, కోలోనోస్కోపీ పాంక్రియాటికోస్కోపిక్ కేసులు ఉన్నాయి. పూణే, విశాఖ నుండి సుమారు 50 మంది ఫ్యాకల్టీ సభ్యులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. భవిష్యత్తులో మెడికవర్‌లో మరిన్ని ఇటువంటికార్యక్రమాలను నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ ప్రదీప్, డాక్టర్. శివా, డాక్టర్ పెదవీర్రాజు, డాక్టర్ గిరినాథ్, డాక్టర్ వాని, డాక్టర్ మురళిమోహన్, డాక్టర్ రాధికచావన్ సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్ పాల్గొన్నారు.



ఇండోర్‌స్టేడియంలో ఉన్న యోగా మ్యాట్‌లు

స్టేడియమా.. గొడౌనా ?

ప్రజాశక్తి -ఎంవిపికాలనీ : ఇంటర్నేషనల్ యోగాడేను పురస్కరించుకొని అవసరానికి మించి తెప్పించిన యోగ మ్యాట్‌లు ఎయు ఇండోర్ స్టేడియంలో దాదాపుగా ఐదులారీల సరుకు నేటికీ నిల్వచేసి ఉంచారు. ఇండోర్‌గేమ్స్ నిర్వహించే స్టేడియంను గోడౌన్ కింద వాడటం చాలా దుర్మార్గమని తాము క్రీడలకు దూరమవుతున్నామని పలువురు ఎయు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విసి, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని మిగిలి ఉన్న మ్యాట్‌లను ప్రభుత్వ స్కూళ్లకు పంపిణీ చేసి ఇండోర్‌స్టేడియంను ఖాళీ చేయించాలని కోరుతున్నారు.

ముంపు బాధితులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసర వస్తువులు అందిస్తున్న సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్



బాధితులకు నిత్యావసర వస్తువులు అందిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-వి.ఆర్‌పురం: మండలంలోని చొక్కానపల్లికి ఐదు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ముంపు గ్రామాల ప్రజలు ఎటు వెళ్ళామన్నా తోవలేక, పనులు లేక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న సర్పంచ్, అధికారులతో మాట్లాడి శ్రీరామగిరి పంచాయితీ చొక్కనపల్లి గ్రామంలో వరదబాధితులకు ఆదివారం నిత్యావసర సరుకులు సర్పంచ్, సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ గత ఐదు రోజులుగా గుట్టలపై పాకలు వేసుకుని ఉన్నారని రహదారులు బంద్ అవటంతో పనులు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వారికి తక్షణమే ఆర్థిక సహాయం చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు తోడంరాజు, కమచిచ్చు, సత్యనారాయణ గొంది ధారయ, శ్రీరామ్‌గిరి శాఖ కార్యదర్శి ఆత్మకూర్ కాంతారావు, విఆర్ఒ సోడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రామవరం పంచాయతీలోని చోపల్లి, రామవరం, రామవరంపాడు, సోములగూడెం, శబరిరాయిగూడెం, కోప్పల్లి, అడవివెంకన్నగూడెం, గ్రామాల్లో వరద బాధితులకు సర్పంచ్ కారం బుచ్చమ్మ, ఎంపిపి కారం లక్ష్మి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.

జీడిగుప్ప పంచాయతీలో సిపిఎం మండల కార్యవర్గ సభ్యులు పంకు సత్తిబాబు, పొడియం శ్రీరామమూర్తి డిప్యూటీ కలెక్టర్ చేతుల మీదుగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. చిన్నమట్టపల్లి పంచాయతీలోని నూతుగూడెం గుర్రంపేట గ్రామాలకు సర్పంచ్ వెట్టిలక్ష్మి సిపిఎం జిల్లా నాయకులు సోయం చిన్నబాబు సబ్ కలెక్టర్ సరుకులు పంపిణీ చేశారు. సిపిఎం మండల కమిటి సభ్యులు పంకు సత్తిబాబు, పోడియంశ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతలో నిలువు నీడ కరువు



పప్పు దినుసులు విక్రయిస్తున్న గిరిజనులు



వర్షంలోనే కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

ప్రజాశక్తి-సీలేరు: జికె వీధి మండలం సీలేరు వారపు సంతలో చిరువ్యాపారులకు దుకాణ సముదాయాలు లేక నానా అవస్థలు పడుతున్నారు. సంత మెయిన్ బజార్‌లోనే సాగడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పంచాయతీ పరిధిలో సంత నిర్వహణకు ప్రత్యేకంగా దుకాణ సముదాయాలు ఏర్పాటు చేస్తే ఎంతో దోహదపడుతుందని వ్యాపారులు భావిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి షెడ్లు లేకపోవడంతో స్థానిక వ్యాపారుల షాపుల ముందునే దుకాణాలు పెట్టుకుని సరకులు విక్రయించుకోవాల్సి వస్తోంది. మెయిన్‌బజార్ లోనే బస్టాండ్ కావడంతో వారపు సంత సమయంలో బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు మార్కెట్లో తిరుగుతుండడంతో మరింత రద్దీగా తయారై ట్రాఫిక్‌సమస్య వేధిస్తోంది. వర్షాకాలంలో అయితే మరింత దుర్భర పరిస్థితి నెలకొంటోంది. వర్షానికి వ్యాపారం చేయలేక వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. దుప్పిలివాడ, కాట్రగడ్డ, పిల్లిగడ్డ గ్రామాల నుంచి గిరిజనులు వారు పండించిన పప్పుదినుసులు కూరగాయలు, ఆకుకూరలు విక్రయాలు చేస్తుంటారు. శాశ్వత షెడ్లు లేకపోవడంతో వ్యాపారం చేయడానికి వీరంతా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగించాలని చిరు వ్యాపారులు కోరుతున్నారు.

అందుబాటులోకి టయోటా అర్బన్ అప్‌గ్రేడ్ వెర్షన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) దాని ప్రసిద్ధ కాంపాక్ట్ ఎస్‌యువి అర్బన్ క్రూయిజర్ టైజర్‌కు రెండు ముఖ్యమైన అప్‌గ్రేడ్‌లను ప్రకటించిందని టయోటా ప్రాంతీయ ప్రతినిధి వరీందర్ వాధ్వా తెలిపారు. ఒక హోటల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కంపెనీ కొత్త బ్లూయిష్ బ్లాక్ బాహ్యరంగును ప్రవేశపెట్టిందన్నారు. అన్ని వేరియంట్లలో 6 ఎయిర్‌బ్యాగ్‌లను ప్రామాణికంగా జోడించిందన్నారు. టయోటా ఎల్లప్పుడూ తన కస్టమర్ల పట్ల అత్యధిక విలువ ఉంచి, సాధ్యమైనంత ఉత్తమమైన కార్లను అందించడంపై దృష్టి సారించిందని చెప్పారు. కొత్త ఆకర్షణీయమైన లుక్ బ్లూయిష్ బ్లాక్‌ను పరిచయం చేస్తోందన్నారు.

26న విశాఖకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : కేంద్రరక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఈ నెల 26న విశాఖ రానున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన వివరాలను అధికారులు ఆదివారం సాయంత్రం వెల్లడించారు. పర్యటనలో భాగంగా ఈనెల 26వ తేదీ ఉదయం 10.15 గంటలకు ఢిల్లీలోని పాలం ఎయిర్‌పోర్టు నుండి బయలుదేరి 12.30 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 12.35 గంటలకు బయలుదేరి 12.55 గంటలకు నావెల్‌బేస్‌లోని ఐఎన్ఎస్ చోళసూట్ చేరుకుంటారు. 12.55 నుండి 2.05 వరకు విశ్రాంతి తీసుకుని అనంతరం 2.05 నుండి 2.45 గంటల వరకు నేవీఅధికారులతో సమావేశం అవుతారు. అనంతరం 2.55 గంటలకు బయలుదేరి 3 గంటలకు ఐఎన్ఎస్ సర్కార్‌లోని ఎన్1-ఎన్3 జట్టికి చేరుకుంటారు. మధ్యాహ్నం 3 గంటల నుండి 4.40 గంటల వరకూ ఇండియన్ నేవీషిప్స్ 'హిమగిరి' 'ఉదయగిరి'నౌకల ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. 4.45 గంటలకు అక్కడ నుండి బయలుదేరి 5 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుని 5.05కు బయలుదేరి ఇండోర్ వెళతారు.



విజేతగా నిలిచిన లేబెన్స్‌హిల్ఫే పాఠశాల జట్టు

ముగిసిన స్పెషల్ ఒలింపిక్స్

ప్రజాశక్తి ,ఎంవిపి కాలనీ : జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ (జెసిఐ) వైజాగ్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన స్పెషల్ ఒలింపిక్స్ క్రీడలు అట్టహాసంగా ముగిసాయి. శనివారం రాత్రి పోలీస్ బ్యారెక్స్‌గ్రౌండ్లో జరిగిన ముగింపు వేడుకల్లో విజేతలకు ట్రోఫీలు బహుకరించారు. సుమారు 900 మంది విభిన్న ప్రతిభావంతులు ఈ క్రీడల్లో పాల్గొన్నారు. క్రీడల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. బహుమతి ప్రధాన కార్యక్రమంలో జెసిఐ వైజాగ్ అధ్యక్షుడు డాక్టర్ నడిపిల్లి చరిష్మా, జోన్ ప్రెసిడెంట్ ఎ.సంతోష్, జోన్ వైస్ ప్రెసిడెంట్ చైతన్య వసంతవాడ, ప్రాజెక్ట్ చైర్మన్ ప్రభాకర్ బొట్టా, రవికాంత్‌రెడ్డి, ఐఆర్ఎస్ అధికారి అప్పలరాజు, విసిపిటిఎల్. ప్రతినిధి జిథా, లీ ఫార్మా ప్రతినిధి లీలారాణి, వెల్నెస్ బ్రాండిక్స్ ప్రతినిధి వసుధ, డిజెటి. హైకా ఎం.డి.సంజయ్, సిఇఒ జోపికా తదితరులు విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సాహించారు.

విజేతలు వీరే:

ఆల్ రౌండ్ ఛాంపియన్స్: లేబెన్స్‌హిల్ఫే స్కూల్ విద్యార్థులు, హియరింగ్ ఇంపెయిర్డ్ ఛాంపియన్స్: ప్రియదర్శిని సర్వీస్ ఆర్గనైజేషన్ స్కూల్ విద్యార్థులు, విజువల్లి ఇంపెయిర్డ్ ఛాంపియన్స్ : నేత్ర విద్యాలయ విద్యార్థులు, ఫిజికల్ చాలెంజ్డ్ ఛాంపియన్స్: అసోసియేషన్ సాయి కొరియన్ స్కూల్ విద్యార్థులు, ఇంటెలెక్చువల్లి ఇంపెయిర్డ్ ఛాంపియన్స్: హిడెన్ స్ప్రౌట్స్ స్పెషల్ స్కూల్ విద్యార్థులు నిలిచారు.

సెంట్రల్ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రాపర్టీ ఎక్స్‌పో



ప్రాపర్టీ ఎక్స్‌పోలో పాల్గొన్న ఉద్యోగులు

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధికారి రికవరీ విభాగం చీఫ్ మేనేజర్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని స్థానిక బ్రాంచ్ మేనేజర్లు ద్వారకానగర్ ఎల్ఐసి భవనంలో ప్రాపర్టీ ఎక్స్‌పో ఆదివారం నిర్వహించారు. ఈ ప్రాపర్టీ ఎక్స్‌పోలో సర్ఫేసి చట్టం కింద అమ్మకానికి ఉన్న ఆస్తులు ఈ వేలం కోసం ఉంచాలని ప్రతిపాదించిన ప్రతిపాదిత ప్రాపర్టీలను కొనుగోలుదారులకు చూపించారు. కార్యక్రమంలో పాల్గొన్న సుమారు 30 మంది పలు ప్రాపర్టీస్‌పై ఆసక్తి కనబరిచారు.